
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 35.0
కనిష్ఠం 23.4
**
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
ఆదివారం 20 జూలై 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	565.00 (244.1480)	67,800	1800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.40 (3.54)	243.51	299.63
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	151.573 (16.8784)	నిల్	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.136 | డ్రెస్ : రూ.203 | స్కిన్‌లెస్ : రూ.228

కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా గోదావరి జలాలు అందించాలి



మూసీ ఎడమకాల్వకు నీటిని విడుదల చేస్తున్న జగదీష్‌రెడ్డి

మూసీ ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన జగదీష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతో బతుకుపోరాటం చేస్తున్న రైతులకు కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా గోదావరి జలాలు అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం మూసీ ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వ ద్వారా ఆయకట్టుకు సాగునీటిని విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతితక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. రైతాంగానికి నీళ్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌లకు లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తప్పును ఒప్పుకుని కన్నెపల్లి పంప్‌హౌస్‌ద్వారా తెలంగాణ ప్రజలకు నీరు అందించాలన్నారు. దీంతో మిడ్‌మానేరు, మల్లన్నసాగర్ ద్వారా బస్వాపూర్, గందమళ్ల, ఎస్సారెస్పీ ద్వారా ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు సమృద్ధిగా నీరు అందుతుందన్నారు. చంద్రబాబు కోసం బనకచర్ల అనుమతులు రావడం కోసమే కాళేశ్వరాన్ని ఎండబెడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ఎండిపోవడంతో దిగువస్థాయి కాంగ్రెస్ నాయకులు ఇసుక అక్రమ రవాణాకు తెగబడ్డారన్నారు. మూసీ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన సోలిపేట, రత్నపురం, రామారం, యర్కారం గ్రామాలకు సైతం గోదావరి జలాలతో పంటలు పండాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జీడీ భిక్షం, నాయకులు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, మోదుగు నాగిరెడ్డి, కాటసాని వెంకట్‌రెడ్డి, యాదగిరి, గన్నారెడ్డి, రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగేదీ?



ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు ఉద్యాన శాఖ సరైన అవగాహన కల్పించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం విస్తృతంగా ఆయిల్‌పామ్ సాగు చేయాలని సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. చిన్న సన్నకారు రైతులకు మొక్కలు, ఎరువులు, డ్రిప్ పరికరాలు 90 శాతం సబ్సిడీతో అందజేస్తున్నప్పటికీ సాగు విస్తీర్ణం ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ఐదేళ్లుగా ప్రయత్నిస్తున్నా జిల్లా వ్యాప్తం కేవలం 4,885 ఎకరాల్లోనే సాగవుతుంది. సరైన అవగాహన కల్పించకపోవడంతోనే రైతులు ఆయిల్‌పామ్‌పై ఆసక్తి చూపించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

» ఇంకా జిల్లావ్యాప్తంగా 4,885 ఎకరాల్లోనే సాగు
» అవగాహన కల్పించని ఉద్యానశాఖ అధికారులు

ఆయిల్‌పామ్ సాగుకు కేవలం బోరు ఉంటే చాలు. ఐదు ఎకరాల్లోపు వారికి ఉచితంగా మొక్కలు 90 శాతం సబ్సిడీతో ఎరువులు, డ్రిప్ అందజేస్తున్నారు. 10 శాతం రైతులు భరించాల్సి ఉంటుంది. ఖమ్మం, భద్రాదికొత్తగూడెం జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుచేస్తూ రైతులు రూ.లక్షలు గడిస్తున్నారు. మొక్కకు రూ.20 చెల్లించాలి. ఎకరానికి 57 మొక్కలు వేయాల్సి ఉంటుంది. అయితే మొక్కకు, మొక్కకు మధ్య దూరం ఎక్కువగా ఉండడం వల్ల తొలి మూడేళ్లు అంతర్ పంటలు పండించి ఆదాయం పొందవచ్చు. మొక్కజొన్న, అరటి, పొద్దుతిరుగుడు, పొగాకు, పసుపు, పూలు, పెసర్లు, మినుము, అలసందలు, నువ్వులు, వేరుశనగ, కూరగాయల పంటలను కూడా వేసుకుని ఆదాయం పొందవచ్చు.

నాలుగేళ్లకు ప్రారంభం.. ఏడేళ్ల నుంచి రాబడి...

నాలుగేళ్ల పాటు ఆయిల్‌పామ్ మొక్కలను జాగ్రత్తగా పెంచితే ఆ తర్వాత దిగుబడి వస్తుంది. నాలుగేళ్ల తర్వాత ప్రతి ఏడాది ఎకరానికి రూ.60 నుంచి 70వేల ఆదాయం వస్తుండగా ఏడవ సంవత్సరం తర్వాత ఎకరానికి రూ.లక్ష ఆదాయం అధికారులు తెలిపారు. ఆయిల్‌పామ్ తయారుచేసే కంపెనీలే మొక్కలను అందిస్తాయి. వారే దిగుబడి కొనుగోలుకు ముందుకువస్తారు. జిల్లాలో ఎక్కువగా టెన్యూర్ అనే రకాన్ని పండిస్తారు. ఎక్కువగా నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. వేసవిలో పుష్కలంగా నీరు అందించే బోరు బావుల కింద సాగు చేయాల్సి ఉంటుంది. సీజన్ బట్టి పాదుల్లో తగినంత తేమ ఉండేలా నీరు అందించాలి. ఉద్యాన శాఖ అధికారుల సలహాల మేరకు ఆయిల్‌పామ్ సాగుచేస్తే మంచి దిగుబడి వస్తుంది. నాలుగేళ్ల తర్వాత దిగుబడి వచ్చినప్పటికీ ఏడేళ్ల తర్వాత నుంచి ఎక్కువగా దిగుబడి వస్తుంది. ఎకరానికి సగటున 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుంది. ఏడేళ్ల తర్వాత ప్రతి నెలా దిగుబడి వచ్చి రైతుకు లాభం చేకూరుతుంది.

పండ్ల తోటలే అధికం...

జిల్లాలో ఎక్కువగా 15,846 ఎకరాల్లో పండ్ల తోటలు. 813 ఎకరాల్లో కూరగాయలు, 1,417 ఎకరాల్లో మిరియాలు, ధనియాలు, ఆవాలు అదేవిధంగా 12 ఎకరాల్లో పూలతోటలు, 82 ఎకరాల్లో పట్టు పరిశ్రమను సాగు చేస్తున్నారు. తుంగతుర్తి, కోదాడ, అనంతగిరి, మద్దిరాల మండలాల్లో 11,829 ఎకరాల్లో మామిడి తోటలను పెంచుతున్నారు. చింతలపాలెం, మట్టంపల్లి, మోతె మండలాల్లో 14,915 ఎకరాల్లో మిర్చి పంటలను సాగుచేస్తున్నారు. తిరుమలగిరి, చివ్వెంల మండలాల్లో 813 ఎకరాల్లో కూరగాయలు సాగుచేస్తున్నారు. ఆయిల్‌పామ్‌ను తుంగతుర్తి, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాల్లో కేవలం 4,885 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగును పెంచాల్సి అవసరం ఎంతైనా ఉందని, రైతులకు ఉద్యానశాఖ అధికారులు నిత్యం సలహాలు, సూచనలు..

- మిగతా 8వ పేజీలో...

ప్రవాహానికి ప్రతిబంధకంగా



సాగర్ ఎడమకాల్వ గేట్ల ముందుభాగంలో నీటిప్రవాహానికి అడ్డుగా ఉన్న రాళ్లు

7

● ప్రధాన గేట్ నుంచి అక్కడక్కడ రాళ్ల కుప్పలు
● మరమ్మతు సమయంలో కాల్వలో వదిలేసిన వ్యర్థాలు
● నీటి ప్రవాహం ఆయకట్టు చివరికి చేరకుండా అడ్డు
● నీటి విడుదలకు సమయమవుతున్నా పట్టింపేదీ?

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వలోని వ్యర్థాలు నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. కాల్వల మరమ్మతులు, ఇతర ప్రమాదాల వల్ల కాల్వల్లోకి చేరిన ఇసుక, ఇతర రాళ్లు రప్పలు నీటి విడుదల సమయంలో కుప్పగా ఏర్పడి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. దీంతో కాల్వకట్టలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. బలహీనంగా ఉండే ప్రదేశాల్లో కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా హుజూర్‌నగర్ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ మేజర్ కాల్వ పరిధిలో ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి



జవహర్ నవోదయ విద్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటుచేయాలని కలెక్టర్ తేజసనందలాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్‌లో ఏర్పాటుచేసిన జవహర్ నవోదయ విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి పరిశీలించారు. ఈ ఏడాది నుంచి జవహర్ నవోదయ విద్యాలయం ప్రారంభమవుతుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనంతరం విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన బెంచీలు, తాగునీరు, ఆర్వో ప్లాంట్, వంటగది, వంట సామగ్రి, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లు, గ్రంథాలయం కోసం ఏర్పాటుచేసిన టేబుల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణు మాధవరావు, డీఈవో అశోక్, తహసీల్దార్ కృష్ణయ్య, జవహర్ నవోదయ ప్రిన్సిపాల్, తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డీఈ రమేష్, ఏఈ ఓబుల్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి భవ్య

కోదాడటౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోదాడ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె. భవ్య అన్నారు. కోదాడ కోర్టులో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు తమ హక్కుల కోసం, తమకు జరుగుతున్న అన్యాయాలపై చట్టాలను రక్షణగా ఉపయోగించుకోవాలన్నారు. గృహహింస కేసులో మహిళలకు షెల్టర్, నష్టపరిహారం, భరణం స్త్రీ, ధనం తిరిగి ఇచ్చేందుకు చట్టం పనిచేస్తోందన్నారు. మొదటి అదనపు జడ్జి ఎండీ. ఉమర్ మాట్లాడుతూ భారతీయ కుటుంబ వ్యవస్థ బలమైనదని, దానికి కాపాడుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. రెండవ అదనపు జడ్జి జకీయా సుల్తానా మాట్లాడుతూ గృహహింస చట్టంలో భాగంగా కుటుంబం నుంచి వేరుగా వేరే ప్రాంతంలో నివసించే వారిపై కేసులు పెట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాల నర్సయ్య, వై. వెంకటేశ్వరరావు, జి. నర్సింహారావు, ఎం. వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్, కె. శరత్‌కుమార్ పాల్గొన్నారు.

రాజకీయ కలకలం



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శనివారం తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో చేసిన ట్వీట్ రాజకీయ కలకలం రేపింది. అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రాజగోపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగంలోని వ్యాఖ్యలను తప్పుబడుతూ ట్వీట్ చేయడం కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలను బహిర్గతం చేసినట్లయింది. గతంలోనూ రాజగోపాల్‌రెడ్డి మాజీ మంత్రి జానారెడ్డిపైనా ఇదేరీతిలో తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

» సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన రాజగోపాల్‌రెడ్డి
» 'ఎక్స్'వేదికగా అభిప్రాయం స్పష్టం
» నిఖార్సయిన నాయకులు, కార్యకర్తలు సహించరని హెచ్చరిక
» తరుచూ కీలక ప్రకటనలతో రాజగోపాల్ సంచలనం
» అధిష్ఠానం మాట తప్పిందనే ఆవేదన

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉమ్మడి జిల్లాలో జరిగే పార్టీ సభలకు, నల్లగొండ జిల్లాలో జరిగే జిల్లాస్థాయి అధికారిక కార్యక్రమాల్లో సైతం రాజగోపాల్‌రెడ్డి ఒకటిరెండు కార్యక్రమాల్లో మినహా మిగిలిన వాటికి గైర్హాజరవడం, నియోజకవర్గానికి మాత్రమే తన పర్యటనలను పరిమితం చేసుకోవడం ఆయన అసంతృప్తిని తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఎక్స్‌వేదికగా రాజగోపాల్‌రెడ్డి సీఎం ప్రసంగాన్ని నేరుగా ఖండించడం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోననే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది.

తీవ్ర అసంతృప్తిలో రాజగోపాల్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వంలో తనకు మంత్రి పదవి పక్కాగా వస్తుందనే ధీమాలో ఉన్న రాజగోపాల్‌రెడ్డికి ఇటీవలి విస్తరణలో సైతం అవకాశం దక్కకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు ఈ ట్వీట్ ద్వారా స్పష్టమవుతోందనే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది. తనకు మంత్రిగా అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిన మాట వాస్తవమని, అధిష్ఠానం మంత్రి పదవి ఇస్తానన్నప్పటికీ, దుర్మార్గంగా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారంటూ ఆయన గతంలో చౌటుప్పల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార సందర్భంలో తీవ్రవ్యాఖ్యలు చేశారు. అదే వేదిక మీద మహాభారతంలో ధర్మరాజులాగా వ్యవహరించాల్సిన జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేయడం అప్పట్లో సంచలనం కలిగించగా, ఆతర్వాత ఆ వ్యవహారం సద్దుమణిగింది. ఇటీవల సైతం ఆయన వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం తాను మంత్రిపదవి అడుగుతానని, తనకు మంత్రిగా బాధ్యతలిస్తే వెనకబడిన ప్రాంతాలకు అభివృద్ధి రుచి చూపిస్తానని రాజగోపాల్‌రెడ్డి తన ప్రసంగాల్లో పేర్కొంటున్నారు. సమర్థత గీటురాయిగా మంత్రిపదవులివ్వాలే తప్ప, కులం, మతం, జిల్లాలను అడ్డుగా చూపి సమర్థులకు అవకాశాలివ్వకపోవడం సరికాదనే వాదన రాజగోపాల్‌రెడ్డి మద్దతుదారుల్లో వ్యక్తమవుతోంది.

లోక్‌సభ ఎన్నికల సమయంలో..

లోక్‌సభ ఎన్నికల సందర్భంలో రాష్ట్రంలో ఒక్కో సీటుకు ఒక్కో మంత్రి ఇన్‌చార్జిగా ఉన్నారని, ఎక్కడా లేని విధంగా భువనగిరిలోనే ఒక ఎమ్మెల్యేనైన తనకు ఇన్‌చార్జిగా బాధ్యతలిచ్చారంటే, తన సమర్థతపైనా, అభ్యర్థిని గెలిపిస్తాననే నమ్మకం ఉండ బట్టే ఇచ్చారని, ఆ ఎన్నికలో అన్ని నియోజకవర్గాలు తిరిగి అభ్యర్థిని గెలిపించడమే తన సమర్థతకు, పనితీరుకు నిదర్శనమని రాజగోపాల్‌రెడ్డి పేర్కొంటున్నారు. మంత్రులు ఇన్‌చార్జిలుగా ఉన్న మహబూబ్‌నగర్, సికింద్రాబాద్...

మిగతా 7వ పేజీలో...

డీటీసీగా సురేష్‌రెడ్డికి పదోన్నతి



డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతిపై వెళ్తున్న సురేష్‌రెడ్డిని సన్మానిస్తున్న సూర్యాపేట ఎంవీఐలు, సిబ్బంది

సూర్యాపేటక్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా రవాణాశాఖాధికారి సురేష్‌రెడ్డి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతి పొంది శనివారం బదిలీ అయ్యారు. కొన్నేళ్లుగా సూర్యాపేట రవాణాశాఖాధికారిగా విధులు నిర్వహించిన సురేష్‌రెడ్డికి ఇటీవల డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతిపై హన్మకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. నూతనంగా జిల్లా రవాణాశాఖాధికారిని సూర్యాపేటలో ఎంవీఐ పనిచేస్తున్న జయప్రకాష్‌రెడ్డికి జిల్లా రవాణా శాఖాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పదోన్నతి పొందిన డీటీసీ సురేష్‌రెడ్డికి సూర్యాపేట రవాణాశాఖ కార్యాలయంలో సిబ్బంది సన్మానించారు.

త్వరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలి



విభలాపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

మోతె, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : త్వరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని జిల్లా పీడీ సిద్ధార్థనాయక్ అన్నారు. మండలంలోని విభలాపురంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. 600 చదరపు గజాల స్థలంలోనే నిర్మించాలని, ఇప్పటికే 81 ఇళ్లకు 63 బేస్‌మెంట్, మిగతా చివరి దశకు చేరుకున్నాయన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఇంటి నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులతో అధికారులు మాట్లాడారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, సిబ్బంది జబ్బార్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

కలెక్టర్, డీఈవోలకు నెమ్మికల్ విద్యార్థుల వినతిపత్రాలు



నెమ్మికల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి సస్పెండ్‌ను రద్దు చేయాలంటూ డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు(ఎస్), జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రధానోపాధ్యాయుడు శ్రీహరిపై సస్పెన్షన్‌ను రద్దు చేయాలని నెమ్మికల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, డీఈవో భిక్షపతిలను కలిసి వినతిపత్రం అందజేశారు. 40 మందితో మూతబడే దశలో ఉన్న పాఠశాలను 120 మందికి శ్రీహరి చేర్చారన్నారు. ఆయన సస్పెన్షన్‌ను ఖండిస్తున్నామన్నారు. కనీసం విద్యార్థులు, తల్లిదండ్రులతో విచారించకుండా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేస్తారన్న సమాచారంతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ సాయంత్రం 5.30గంట వరకు కొనసాగే పాఠశాల తరగతులు శనివారం నాలుగు గంటలకే ముగిశాయి. హెచ్‌ఎం శ్రీహరి సస్పెండ్‌ను రద్దు చేసే వరకు పాఠశాలకు రామని విద్యార్థులు, వారిని పంపించలేమని తల్లిదండ్రులు తెలిపారు.

హెచ్‌ఎం శ్రీహరి సస్పెన్షన్

మండల పరిదిలోని నెమ్మికల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ.శ్రీహరిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ డీ.సుకన్యను వేధించారన్న ఫిర్యాదు నేపథ్యంలో ఈ నెల 17న గిరిజన ఉపాధ్యాయ సంఘాలు కూడా ఫిర్యాదు చేశాయి. ఈ క్రమంలో కలెక్టర్ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

అదనపు తరగతుల వివాదం..

నెమ్మికల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీహరి సస్పెన్షన్‌కు అదనపు తరగతుల విషయమే కారణంగా తెలుస్తోంది. మొత్తం పాఠశాలలో 10 మంది బోధన, ముగ్గురు బోధనేతర సిబ్బంది ఉన్నారు. ఉపాధ్యాయుల సమావేశంలో పలు విషయాలపై స్కూల్ అసిస్టెంట్ సుకన్య వ్యతిరేకించినట్లు సమాచారం. సాయంత్రం అదనపు తరగతి తీసుకునేందుకు సుకన్య ఒప్పుకునేది కాదని ఈ విషయంలో ఇద్దరి మధ్య వివాదం మొదలైనట్లు తెలిసింది. విమర్శలకే పరిమితమైన వివాదం హెచ్‌ఎం శ్రీహరి వేధిస్తున్నాడని సుకన్య గిరిజన సంఘం ఉపాధ్యాయులతో కలిసి డీఈవో భిక్షపతికి ఫిర్యాదుతో తారాస్థాయికి చేరింది. గిరిజన ఉపాధ్యాయ నాయకులు అధికారులు ఒత్తిడి తేవడంతో శుక్రవారం సాయంత్రం హెచ్‌ఎం శ్రీహరిని విధుల నుంచి తొలగించారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



సూర్యాపేట బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సీ అంజిరెడ్డి

భానుపురి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఎమ్మెల్సీ సీహెచ్. అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీ విధానాలు, అభివృద్ధి కృషిని ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల మద్దతును పొందే మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, ఆవాస్ యోజన, హర్ ఘర్‌జల్ వంటి పథకాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా ప్రభారీ గోలి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, జిల్లా కన్వీనర్ కడియం రామచంద్రయ్య, బొబ్బా భాగ్యారెడ్డి తదితరులు ఉన్నారు.

మా ఊరి షాపింగ్ మాల్

▸ వారానికి ఒకసారి సాగే సంతలు
▸ చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో సందడి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికీ వారం తాపు సంతలు కొనసాగుతున్నాయి. తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను రైతులు సంతలకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వీటితో పాటు చిరు వ్యాపారులు పండ్లు, వస్త్రాలు, చెప్పులు, వ్యవసాయ పరికరాలు విక్రయిస్తుంటారు. సామాన్లు, తినుబండారాల రూపంలో సంతలు చిరువ్యాపారులకు, ప్రజలకు వారధిగా ఉంటున్నాయి. పశువులు, మేకల క్రయ విక్రయాల కోసం సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారులు వస్తుంటారు. వారానికి ఒక రోజు ఒకసారి జరిగే సంతలతో సందడి ఉంటుంది.



తిరుమలగిరిలో కొనసాగుతున్న వారాంతపు సంత(ఫైల్)



40 సంవత్సరాలుగా మల్లేపల్లి పశువుల సంత

కొండమల్లేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మేజర్ గ్రామపంచాయతీలో ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తారు. సుమారు 40ఏళ్ల ఇక్కడ వారంతపు సంత కొనసాగుతోంది. నాలుగురోడ్ల కూడలి కావడంతో రద్దీగా ఉంటుంది. దేవరకొండ, నాంపల్లి, చింతపల్లి, పీఏపల్లి, గుర్రంపోడు, చందంపేట, రంగారెడ్డి జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లా వివిధ దూర ప్రాంతాల నుంచే కాకుండా పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి ఆదివారం రోజు పశువుల సంతకు క్రయ, విక్రయదారులు వస్తుంటారు. అక్కడ అన్ని రకాల కూరగాయలు, కావాల్సిన నిత్యావసర వస్తువులు, పండ్లు, మాంసం వ్యవసాయ రంగానికి సంబంధించిన రైతులకు ఉపయోగపడే అన్నిరకాల వస్తువులు విక్రయిస్తారు. వారాంతపు సంతకు సుమారు 20వేల జనాభా వరకు వచ్చి వెళ్తుంటారు. సంతలో దాదాపు లక్షలో వ్యాపారం జరుగుతుంది. సంతలో 50నుంచి 70మంది గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది పనిచేస్తారు. ఇంత వ్యాపారం జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్లాస్టిక్ నిషేదం అమల్లో లేకపోవడంతో ప్లాస్టిక్‌ను యథేచ్ఛగా వాడుతున్నారు.

తిరుమలగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీలో ప్రతి బుధవారం సంత నిర్వహిస్తారు. 60ఏళ్లుగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సంత ఉపయోగపడుతుంది. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, వస్త్రాలు, వట్టిచేపలు, చెప్పులు, వ్యవసాయ పనిముట్లు, వంట సామాన్లు, తినుబండారాలు లభిస్తాయి. పట్టణాల్లో, గ్రామాల్లో ఎన్ని రకాల కిరాణ షాపులు, మార్ట్‌లు ఉన్నా కూరగాయల షాపులు ఉన్నా తిరుమలగిరిలో బుధవారం జరిగే సంతకు వచ్చి వారానికి సరిపడా కూరగాయలు, వస్తువులు తీసుకెళ్తారు. తిరుమలగిరి మండలం, నాగారం అర్వపల్లి, పక్క జిల్లాలైన జనగాం, మహబూబాబాద్, యాదాద్రి భువనగిగిరి, మండాలలు, దేవర్పుల, మొండ్రాయి, కొడకండ్ల, పెద్దవంగర, అడ్డగూడూరు మండలాల్లో గిరిజన తండాలు ఎక్కువ.

పశువులకు, మేకలకోసం సుదూర ప్రాంతాల నుంచి..

తిరుమలగిరి మార్కెట్‌కు అన్ని రకాల పశువులు వస్తుంటాయి. రైతులు తమ వ్యవసాయ పనులకోపం ఎద్దులు, సాకడానికి బర్రెల కోసం దూరప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తారు. పండుగలు, శుభకార్యాలకోసం సంతలో పొట్టేళ్లు, మేకలకోసం వస్తుంటారు. తమకు నచ్చిన, అమోదమైన ధరకు లభిస్తాయని రైతులు చెబుతుంటారు. తిరుమలగిరిలో నిర్వహించే సంత ప్రతి బుధవారం బతుకమ్మ పండుగలా కనిపిస్తుంది. చిరువ్యాపారులు, ప్రజలతో కలిసి సుమారు 10వేల మంది వస్తుంటారు. మహిళలు కుటుంబసభ్యులతో కలిసి సంతలో కూరగాయలు, పండ్లు కొనుక్కునే వెళ్లేటప్పుడు ఎంతో కోలాహలంగా ఉంటుంది.

చౌటుప్పల్ అంగడిలో సందడి

చౌటుప్పల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలకేంద్రంలో ప్రతి ఆదివారం సంతకు సంత నిర్వహిస్తారు. 50 సంవత్సరాలుగా ఈ అంగడి జరుగుతుంది. గతంలో పశువుల సంతకు ఈ అంగడి పేరుగాంచింది. ప్రస్తుతం కూరగాయలు, పాత వస్త్రాలు, నిత్యావసర వస్తువులు లభిస్తాయి. సుమారు రెండు దశాబ్దాల క్రితం ఎక్కువగా రైతులే అంగడిలో కనిపించేవారు. పశువులు మేకల వ్యాపారం సాగించేవారు. గడచిన రెండు దశాబ్దాల కాలంలో చౌటుప్పల్ పట్టణం గణనీయంగా విస్తరించింది. చౌటుప్పల్ మండల కేంద్రం ఈ పరిసరాల్లో ఎక్కువగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అంగడి పరిసర ప్రాంతాలు, సర్వీసు రోడ్డు ప్రాంతాలన్నీ జనంతో కిటకిటలాడతాయి. ఇక్కడ జరిగే పాత వస్త్రాల వ్యాపారం ఎంతో ప్రసిద్ధి చెందింది. దినసరి కూలీలు, కార్మికులు ఎక్కువగా పాత వస్త్రాలు కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడి పాత వస్త్రాల వ్యాపారం పాముఖ్యతపై పాఠ్య పుస్తకాల్లో సైతం ప్రచురించారు. సంత రోజున పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు తాము పండించిన పంటలను విక్రయిస్తుంటారు. సంతలో ప్లాస్టిక్ నిషేదం అమలైన దాఖలాలు కనిపించడం లేదు. క్రయవిక్రయాలు నిర్వహించడానికి ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు.

30 ఏళ్లుగా సంతలో కూరగాయలు విక్రయిస్తున్నా



తిరుమలగిరి సంతలో 30 ఏళ్లుగా కూరగాయలు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నాను. చుట్టుపక్కల సంతల కన్నా, తిరుమలగిరిలో వ్యాపారం ఎక్కువగా సాగుతుంది.

- వేముల లక్ష్మి, కూరగాయల వ్యాపారి తిరుమలగిరి

తాజా కూరగాయలు దొరుకుతాయి



తిరుమలగిరి సంతలో తాజా కూరగాయలు, దొరుకుతాయి. కొన్నేళ్లుగా ప్రతి బుధవారం తప్పకుండా సంతలో రకరకాల కూరగాయలు వారానికి సరిపడా కొనుక్కుంటాం

- బనువరి నర్సయ్య, రిటైర్డ్ ఉద్యోగి

20 సంవత్సరాలుగా కుండలు అమ్ముతున్నా

నేను కొండమల్లేపల్లిలో దాదాపుగా 20 సంవత్సరాలుగా ప్రతి ఆదివారం జరిగే సంతలో కుండలు అమ్ముతాను. వారంలో ఒకే రోజు సంత కావడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కుండలు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. అలాగే నిత్యం రద్దీగా ఉంటుంది. కుండల వ్యాపారం బాగా నడుస్తుంది.

- ఘనపురం అంజయ్య, గుడిపల్లి గ్రామం

శతాధిక వృద్ధుడు మృతి



లింగయ్య(ఫైల్)

నార్కట్‌పల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు రేషన్ డీలర్ కూడా అయిన గూడ లింగయ్య(102) శనివారం మృతిచెందాడు. కొంతకాలంగా లింగయ్య తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఆయన సీనియర్ డీలర్‌గా స్థానిక డీలర్లు చెబుతున్నారు. లింగయ్యకు భార్య మల్లమ్మ, ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. లింగయ్య మృతిపట్ల మండల రేషన్ డీలర్లు సంతాపం తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



లింగయ్య(ఫైల్)

పాలకవీడు, జూలై19: (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని కోమటికుంట గ్రామంలో గురువారం రాత్రి ఊర చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం ఉదయం లభ్యమైంది. ఎస్ఐ కోటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోమటికుంట గ్రామానికి చెందిన రాతికిందచిన లింగయ్య(57) గురువారం రాత్రి ట్యూబ్ సాయంతో ఊర చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. రెస్క్యూటీం, పాలకవీడు పోలీసు సిబ్బంది పడవల సాయంతో వెతకగా శనివారం ఉదయం లింగయ్య మృతదేహం లభించింది. లింగయ్య భార్య కామేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కేజీబీవీ వాచ్‌ఉమన్ ఆత్మహత్యాయత్నం



చికిత్సపొందుతున్న బాధితురాలు అరుణ

అడవిదేవులపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మండలకేంద్రంలోని కేజీబీవీలో వాచ్‌ఉమన్‌గా పనిచేస్తున్న అరుణ శనివారం పాఠశాలలో ఆత్మహత్యాయత్నం చేసింది. మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామానికి చెందిన అరుణ తొమ్మిది సంవత్సరాలుగా కేజీబీవీలో పనిచేస్తోంది. శనివారం ఆలస్యంగా వచ్చిన అరుణను ఎందుకు ఆలస్యంగా వచ్చావని ఎస్‌వో అడిగారు. తాను కేవలం ఐదు నిమిషాలు మాత్రమే ఆలస్యంగా వచ్చానని, దీనికే నిలదీస్తారా అని అనడంతోపాటు మీరు పనివాళ్ల మధ్య గొడవలు సృష్టించి ఒకరినొకరు కొట్టుకునేలా చేస్తున్నారని, దీంతో తాము చచ్చే పరిస్థితి వచ్చిందని అనడంతో, అయితే చావు అని ఎస్‌వో నాగలక్ష్మీ అనడంతో అరుణ దగ్గరల్లో ఉన్న విద్యుత్ వైర్‌ను పట్టుకునేందు యత్నించడంతో సిబ్బంది అడ్డుకున్నారు. అయినా అరుణ ఆగకుండా ఓ విద్యార్థిని చున్ని తీసుకొని మెడకు గట్టి బిగించుకోబోగా, సిబ్బంది వారించారు. అరుణను స్థానిక గ్రామీణ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. ఈ సందర్భంగా బాధితురాలు అరుణ మాట్లాడుతూ ఎస్‌వో వేధింపులు భరించలేకపోతున్నామని, నిత్యం తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించింది. ఎస్‌వో నాగలక్ష్మీని వివరణ కోరగా తాను నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నానని, పాఠశాల మెనూ విషయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విద్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని చెబితే, సిబ్బందిలో కొందరు తనను ఇబ్బందులకు గురిచేసేందుకు తాను అనని మాటలను అన్నట్లుగా చెప్పి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు విడుదల చేయాలి

చిట్యాలరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా వేతనాలు రాక కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి చేకూరి మల్లేష్ కోరారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు చిట్యాల ఎంపీడీవో ఎస్‌పీ జయలక్ష్మికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న తాము పథకంలో కీలకంగా ఉంటూ పనులు చేయిస్తున్నామని, ఎంత చేసినా తమ పరిస్థితులు మారడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మర్రి రమేష్, జోగు లింగస్వామి, నూనె శివ, వీరమల్ల ఉషారాణి, వడ్డగాని రాధ, స్వప్న, చాంద్‌పాషా, మంజుల, అనిత, వరలక్ష్మి, శోభారాణి తదితరులు ఉన్నారు.

అడవి జంతువు సంచారం?

భువనగిరి రూరల్, జూలై 19(ఆంధ్ర జ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని రెడ్డినాయక్‌తండా, పచ్చ ర్లబోడుతండా, మూసీ పరీవాహక ప్రాంతాల్లో అడవి జంతువు సంచరిస్తోందని పుకార్లు వస్తు న్నాయి. జిల్లా ఫారెస్టు అధికారి పద్మ జారాణి ఆదేశాల మేరకు సెక్షన్ ఆఫీసర్ శ్రీను, బీట్ ఆఫీసర్ లక్ష్మణ్ శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. గ్రామ సమీపంలోని వ్యవ సాయ పొలాల వద్ద అడవి జంతువు కంటపడిందని, ఈ క్రమంలో కుక్కలపై దాడిచేసి సమీపంలోని గుట్టలపైకి పారిపోయిందని స్థానిక రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫారెస్టు అధికారులు అప్రమత్తమై అడవి జంతువు సంచరిస్తోందన్న ప్రాంతాల్లో పాదాల ముద్రల కోసం వెతికారు. చుట్టు పక్కల ఎలాంటి ఆనవాళ్లు లేవని ప్రాథమికంగా అంచనా వేశారు. రాత్రి వేళల్లో రైతులు ఒంటరిగా వ్యవసాయ బావుల వద్దకు వెళ్లొద్దని తెలిపారు. గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఎస్ఐల బదిలీలు

నల్లగొండక్రైం, సూర్యాపేట జూలై 19(ఆంధ్ర జ్యోతి): నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పలువురు ఎస్ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఆయా జిల్లాల ఎస్పీలు శరత్‌చంద్ర పవార్, కొత్తపల్లి నర్సింహ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నల్లగొండ జిల్లాలో

ఎస్ఐ	ప్రస్తుతం	బదిలీ
కే రాజీవ్‌రెడ్డి	నల్లగొండ	కనగల్
పీ విష్ణుమూర్తి	కనగల్	సీసీఎస్
ఎం సంజీవరెడ్డి	నల్లగొండ	వీఆర్ గట్టుప్పల్ అటాచ్
జీ వెంకట్‌రెడ్డి	గట్టుప్పల్	సీసీఎస్
సీహెచ్ బాలకృష్ణ	వీఆర్	డిండి
బీ రాజు	డిండి	డీఐజీఆఫీసులో రిపోర్ట్
నాగేంద్రబాబు	నల్లగొండ	నేరేడుగొమ్ము

సూర్యాపేట జిల్లాలో

ఎస్ఐ	ప్రస్తుతం	బదిలీ
శివతేజ	వీఆర్	సూర్యాపేట-2
ఆంజనేయులు	సూర్యాపేట-2	వీఆర్
సీహెచ్ గోపాల్‌రెడ్డి	వీఆర్	కోదాడరూరల్
అనిల్‌రెడ్డిని	కోదాడరూరల్	వీఆర్
సురేష్‌రెడ్డి	వీఆర్	చిలుకూరు
రాంబాబు	చిలుకూరు	వీఆర్
అజయ్‌కుమార్	వీఆర్	మోతె
యాదవేంద్రరెడ్డి	మోతె	వీఆర్

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి



హరిసింగ్ (ఫైల్)

మఠంపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని అవిరెని కుంటతండాలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అవిరెనికుంటతండాకు చెందిన బానోతు హరిసింగ్ (46) తనకు ఉన్న ఎకరం వ్యవసాయ పొలంలో నారుమడి వేశాడు. నారుమడిలో ఉదయం నీరు పెట్టేందుకు వెళ్లిన హరిసింగ్ మోటరుకు విద్యుత్ సరఫరా రాకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఏబీస్విచ్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హరిసింగ్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చిట్యాలరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూర్‌లోని డీఈసీ కంపెనీలో శుక్రవారం సాయంత్రం జరిగింది. చిట్యాల ఎస్ఐ ఎం. రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఏపూర్ శివారులో గల డీఈసీ కంపెనీలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజిత్ బన్సాల్(30)రెండేళ్ల క్రితం కూలీ పని కోసం వచ్చాడు. భార్య, పిల్లలతో కలిసి కంపెనీకి సంబంధించిన క్వార్టర్స్‌లోనే నివాసముంటున్నాడు. శుక్రవారం తాను ఉంటున్న గది వద్ద ఉండే షెడ్ పక్కవైపు నడుచుకుంటూ వెళ్తుండగా అక్కడ ఉన్న ఇనుపరాడ్‌ను పట్టుకోగా అదే సమయంలో వర్షం వస్తుండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. బన్సాల్ భార్య రాధా శనివారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బన్సాల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తల్లిని తీసుకెళ్లేందుకు నిరాకరించిన కుమారులు

• పోలీసులకు ఫిర్యాదు చేసిన వృద్ధాశ్రమ నిర్వాహకులు • నల్లగొండ జిల్లాలో నార్కట్‌పల్లి మండలంలో ఘటన



ధనమ్మ (ఫైల్)

నార్కట్‌పల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలో చేర్పించిన తల్లి మతి స్థిమితంలేకుండా ప్రవర్తిస్తోందని ఆశ్రమ నిర్వాహకులు కుమారులకు తెలిపారు. వారు తల్లిని తమ వెంట తీసుకెళ్లేందుకు నిరాకరించడంతో ఆశ్రమ నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో శనివారం జరిగింది. కట్టంగూర్‌కు చెందిన వృద్ధురాలు(సుమారు 80 సంవత్సరాలు) ఇల్లెందుల ధనమ్మను ఆమె ముగ్గురు కుమారులు, కూతురు కలిసి నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం బస్‌స్టేజీ సమీపంలోని శ్రీవాసవీ వృద్ధాశ్రమంలో 2024 డిసెంబరు 19వ తేదీన చేర్పించారు. అప్పటి నుంచి ఆమె ఈ వృద్ధాశ్రమంలోనే ఉంటోంది. కొన్ని రోజులుగా ధనమ్మ మతి మరుపు వచ్చినట్లుగా ప్రవర్తిస్తోంది. వారం రోజుల క్రితం కుర్చీ ఎక్కి భవనంపై నుంచి కిందకు దూకేందుకు ప్రయత్నించింది. గమనించిన ఆశ్రమ నిర్వాహకులు వెంటనే ఆమెను గదిలోకి తీసుకెళ్లారు. ధనమ్మ ప్రవర్తనను వృద్ధాశ్రమ నిర్వాహకులు రంగ శేఖర్, మీల సోమయ్య ఆమె కుమారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారి నుంచి సరైన స్పందన రాలేదు. కాగా శుక్రవారం గదిలో టవల్‌ను మెడకు చుట్టుకుని ఆత్మహత్యాయత్నం చేయడంతో ఆశ్రమ ఉద్యోగి ఆమెను వారించాడు. పరిస్థితిని నిర్వాహకులు చెప్పడంతో వారు వచ్చి ఆమెను కారులో ఎక్కించుకుని కట్టంగూరులోని రెండో కుమారుడి వద్దకు తీసుకెళ్లారు. కానీ తల్లిని ఇంట్లోకి రానివ్వకపోవడంతో చేసేది లేక వృద్ధాశ్రమ నిర్వహకులు నార్కట్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. ధనమ్మ ప్రవర్తనను కుమారుల వైఖరిని వివరించి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ సూచన మేరకు మేరకు ధనమ్మను తిరిగి వృద్ధాశ్రమానికి తీసుకెళ్లిన నిర్వాహకులు ప్రస్తుతం ఆమెకు ప్రత్యేక భద్రత కల్పిస్తున్నారు. ఎస్ఐ స్వయంగా వెళ్లి ధనమ్మతో మాట్లాడారు. కుమారులను పిలిపించి మాట్లాడుతానని మంచిగా ఉండాలని సూచించారు. తల్లిని ఆదివారం ఇంటికి తీసుకెళ్తానని కుమారుడు వృద్ధాశ్రమ నిర్వాహకులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు.

నాగులపాటిఅన్నారంలో భయం.. భయం

• వరుస మరణాలతో హడలెత్తుతున్న గ్రామస్థులు



పెన్‌పహాడ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మండల పరిధిలోని నాగులపాటి అన్నారంలో నెలరోజులుగా వరుస మరణాలు గ్రామస్థులను భయపెడుతున్నాయి. దీంతో వారు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. 60సంవత్సరాల పైబడిన నలుగురు అనారోగ్యంతో మృత్యువాతపడ్డారు. 48 సంవత్సరాల లోపు వయస్సున ఐదుగురు ఆకస్మాత్తుగా చనిపోయారు. వీరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో ఏ సమయంలో ఎవరు మృత్యువాత పడుతున్నారో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. 60ఏళ్లు దాటిన రామినేని సావిత్రమ్మ, దొంతగాని కృష్ణయ్య, మీసాల అంజమ్మ, కల్లంచెర్వు దేవమ్మ అనారోగ్యంతో మృతిచెందారు.

వేర్వేరు కారణాలతో యువకులు..

గ్రామానికి చెందిన నక్కశివ ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి కిందపడి తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. పర్సబోయిన సైదులు అలియాస్ చంద్రబాబునాయుడు చెరువులోకి వెళ్లి చేపలు పడుతుండగా ప్రమాదశాత్తు మృతిచెందాడు. గర్నెబాలయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగానే గుండెపోటుతో మరణించాడు. దొంతగాని నాగయ్య తన పొలం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మోటర్ వేస్తుండగా విద్యుదాఘాతంతో మృతిచెందాడు.

సాక్షులను బెదిరించిన నిందితుడికి రిమాండ్

చింతలపాలెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయంలో సాక్షులను బెది రించిన నిందితుడిని, అతడి సోదరులను శుక్రవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం రేబల్లె గ్రామానికి చెందిన కొమరబోయిన పవన్‌పై 2022వ సంవత్సరంలో పోక్సో కేసులో అరెస్టయ్యాడు. అనంతరం కొద్దిరోజులకే కోర్టు బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయితే కేసు ప్రస్తుతం తుదిదశకు వస్తుండడంతో నిందితుడి సోదరులు కొమరబోయిన రాజు, కొమరబోయిన సాయి కేసు ఫిర్యాదుదారులు, సాక్షులను, సాక్ష్యం చెప్పవద్దని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఫిర్యాదుదారుడు చింతలపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన ఎస్ఐ వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎన్‌హెచ్-167 విస్తరణకు గ్రీన్‌సిగ్నల్


• నాలుగు లేన్లుగా దేవరకొండ- కోదాడ రహదారి • 219 కిలోమీటర్లు.. 2028 కల్లా పూర్తి చేయాలని లక్ష్యం



జడ్చర్ల - దేవరకొండ జాతీయ రహదారి

దేవరకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్-167 విస్తరణకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో జడ్చర్ల నుంచి దేవరకొండ మీదుగా కోదాడ వరకు రవాణా వ్యవస్థ మెరుగుపడనుంది. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న రహదారి జడ్చర్ల, కల్వకుర్తి, దేవరకొండ, కొండమల్లేపల్లి, హలియా, మిర్యాలగూడ మీదుగా కోదాడ వరకు 219 కిలోమీటర్లు నాలుగు వరుసల రోడ్డు నిర్మించనున్నారు. 2028కల్లా రహదారి పూర్తి చేయడమే లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రోడ్డు విస్తరణతో దుకాణ సముదాయాలు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రహదారి విస్తరణపై పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రావాల్సి ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. మరోసారి దేవరకొండ, కొండమల్లేపల్లిలో రోడ్డు విస్తరణ అవుతుండడంతో ట్రాఫిక్ సమస్యకు కూడా పరిష్కారం లభించనుంది. రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుముఖం పట్టే అవకాశముంది.

రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి



జడ్చర్ల, కోదాడ, వయా దేవరకొండ మీ దుగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లైన్ల రోడ్డు మంజూరు చేయడం హర్షణీయం. రోడ్డు విస్తరణతో రవాణా వ్యవస్థ పెరుగుతుంది. రహదారి నిర్మా ణంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుంది.

• వస్కుల సుధాకర్, దేవరకొండ.

పరిహారం ఇచ్చాకే పనులు ప్రారంభించాలి



నల్లగొండ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): బైపాస్ విస్తరణలో సర్వే చేయించి భూములు కోల్పోయే వారికి నష్టపరిహారం ఇచ్చాకే రోడ్డు పనులు ప్రారంభించాలని భూనిర్వాసితుల పోరాట కమిటీ గౌరవ అధ్యక్షుడు సయ్యద్ హాషం, కో కన్వీనర్లు నాగార్జునరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణం గిరకబాయిగూడెంలోని జాతీయ రహదారి కాంట్రాక్టర్ క్యాంప్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలో 14కిలోమీటర్ల విస్తరణలో 1250 మంది నిర్వాసితులు ఉన్నారని గుర్తించామని తెలిపారు. మంత్రులు కలగజేసుకొని వారందరికీ నష్టపరిహారం అందించేలా చూడాలన్నారు. అప్పటి వరకు రోడ్డు నిలిపి వేయాలన్నారు డిమాండ్ చేశారు. బాధితులు విలువైన భూములు కోల్పోతారని తెలిపారు. ఆ భూముల్లో పంటలు కూడా వేశారని వాటికి కూడా నష్టపరిమారం ఇవ్వాలన్నారు. కార్యాలయ మేనేజర్ సత్యం మాట్లాడుతూ రైతులందరికీ నష్టపరిహారం చెల్లించిన తర్వాత, రైతుల అనుమతితోనే రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. అంతవరకు ఏ రైతు భూమిలో కూడా రోడ్డు వేయబోమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ గౌరవ సలహాదారుడు దండెంపల్లి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ ఊట్కూరి వెంకట్‌రెడ్డి, కోశాధికారి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రలు గాడి తప్పాయి : చిరుమర్తి



మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

నల్లగొండ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గంలో శాంతి భద్రతలు గాడి తప్పాయని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్రపవార్‌ను శనివారం కలిశారు. నకిరేకల్ నియోజకవర్గంలో జరుగుతున్న ఆగడాల గురించి వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లు ప్రశాంతంగా ఉన్న నకిరేకల్ నియోజకవర్గంలో కొందరు కావాలని అలజడి సృష్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తూ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ వారు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌గా పనిచేసిన వ్యక్తికే మంజూరు చేయడం పట్ల నకిరేకల్ మండలంలోని తాటికల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త మనోహర్‌రెడ్డి సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు అతనిపై మాజీ సర్పంచ్‌తో పాటు అతని అనుచరులు విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. కడపర్తి గ్రామంలో బోర్ల బిక్షమయ్య అనే రైతు భూ వివాదంలో ప్రత్యర్థి ఎమ్మెల్యే గన్‌మెన్ కావడంతో ఆ సమస్యను స్థానిక పోలీసులు సంవత్సరం నుంచి పట్టించుకోవడం లేదని విమర్శించారు.

నత్తనడకన ఆధునికీకరణ పనులు

» గడువు పొడిగించినా చేరని లక్ష్యం » వానాకాలం సీజన్‌కు ముందు పనులు ప్రారంభం » ఆందోళనలో ఆయకట్టు రైతులు



నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగున్నాయి. ఎడమకాల్వ మొద టిజోన్ పరిధిలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజ కవర్గాల పరిధిలో సుమారు 60 కిలోమీటర్ల మేర ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం 2022లో రూ.183 కోట్లు మంజూరు చేసింది. మూడేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో నాణ్యత లేకపోవడంతో పాటు కాంట్రాక్టర్ల నిర్ల క్ష్యంతో పనులు సగం కూడా పూర్తికాలేదు.

(ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)

ఎడమకాల్వ పరిధిలోని మేజర్ల ఆధునికీకరణ పనుల గడువు గతేడాది జూన్ నాటికే పూర్తయ్యింది. అయితే ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఏడాది పాటు గడువు పొడిగించింది. అయినా పనులు పూర్తికాక పోగా ఎప్పుడు పూర్తిచేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆధునికీకరణ పనులు మొత్తం సబ్‌కాం ట్రాక్టర్లే చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా సాగర్ ఎడమకాల్వ పరిధిలోని మునగాల హెడ్‌రెగ్యు లేటర్ నుంచి ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ సుమారు 60కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ముక్త్యాల మేజర్ 30 కిలోమీటర్లు, చింతిర్యాల మేజర్ మరో 30 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఎంబీ కెనాల్‌కు సంబం ధించి ప్రధాన మేజర్లు లింగగిరి, ముక్త్యేశ్వరపురం, మట్టపల్లి, చింతిర్యాల, రామాపురం, కందిబండ, గుండ్లపల్లి, రెడ్లకుంటతో మైనర్ కాల్వలు ఉన్నాయి. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలో ముక్త్యేశ్వరపురం వరకు ఏనాడూ నీళ్లు అందించిన దాఖలాలు లేవు. ఎంబీ కెనాల్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 1.15 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించింది. ప్రతి ఏటా బ్రాంచ్ కెనాల్ పరిధిలో 60 శాతం ఆయకట్టుకు మాత్రమే నీరు చేరుతుంది. 40 శాతం ఆయకట్టు చివరి భూములుగా మారాయని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎడమ కాల్వ పరిధిలోని హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో సుమారు 2.75లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ఎంబీసీకి 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని అధి కారులు ఆదేశించారు. ప్రస్తుతం ఎంబీసీ మొదటి 14 కిలోమీటర్ల పరిధిలో సబ్ కాంట్రాక్టర్లు పనులు చేప ట్టారు. దాంతో పాటు లింగగిరి మేజర్ పరిధిలో సుమారు 9 కిలోమీటర్ల మేరకు పనులు చేయాల్సి ఉంది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మూడే ళ్లుగా పనులు పూర్తిచేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నా రన్న విమర్శలు ఉన్నాయి.గత ఏడాది వానాకాలం ముందు 14వ కిలోమీటర్ల చివరిభాగంలో సుమారు 5కిలోమీటర్ల పనులు చేసి చేతులు దులుపుకున్నారు. నీటివిడుదలకు ఒక్కరోజు ముందు వరకు పనులు చేయగా ఈ ఏడాది కేవలం మే చివరి వారంలో పనులు మొదలుపెట్టారు. ఎండాకాలం అంతా పనులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఈ ఏడాది తిరిగి వానాకాలం సీజన్ ప్రారంభదశలో పనులు చేపట్టి నామమాత్రంగా చేస్తున్నారన్న విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పిచ్చిమొక్కలతో కాల్వలు

ఎంబీ కెనాల్ పరిధిలోని ముక్త్యేశ్వరపురం, మట్ట పల్లి మేజర్, లింగగిరి మేజర్లలలో కాల్వల పరిస్థితి దయనీయంగా మారింది. కాల్వలు ఆనవాళ్ల కూడా లేకుండాపోయాయి. పిచ్చిమొక్కలతో ప్రధాన మేజర్లు దర్శనమిస్తున్నాయి. మరో రెండు వారాల్లో నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ఎన్నెస్పీ అధికారులు పేర్కొంటుండగా ఆధునికీక రణ పనులు నత్తనడకన సాగుతుండడంపై ఆయ కట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆధునికీకరణ పనుల్లో నిర్లక్ష్యం తగదు



సాగర్ ఆధునికీకరణ పనుల విషయంలో నిర్లక్ష్యం తగదు. వేసవి కాలమంతా పనులు చేయ కుండా నీటి విడుదలకు నెల రోజుల ముందు పనులు చేయడం సరైన విధానం కాదు. చివరి భూములకు నీరందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పనుల్లో నాణ్యతా లేదు. కాంట్రా క్టర్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు.

- పల్లె వెంకటరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, హుజూర్‌నగర్

పనులు పూర్తి చేసేందుకు కృషి

ఆధునికీకరణ పనులు పూర్తిచేసేందుకు కృషి చేస్తాం. మిగిలిన పనులు వచ్చే ఏడాదికి పూర్తిచేస్తాం. రైతుల నీటి అవసరాల దృష్ట్యా పనులు వేగవంతం చేశాం. సాంకేతికపరమైన ఇబ్బందులతో పనులు ఆలస్యమ వుతున్నాయి. అధికారులు దగ్గరుండి పనులు చేయి స్తున్నారు. నాణ్యతతో పనులు జరుగుతున్నాయి.

- రాంకిషోర్, ఈఈ, ఎన్ఎస్‌పీ



రాజకీయ కలకలం

(5వ పేజీ తరువాయి)

మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల స్థానాల్లో ఎందుకు ఓడిపోయారని,ఈ మంత్రులంతా ఎటు పోయారని ప్రశ్నించడం ద్వారా లోక్ సభ ఎన్నికలపై రాజగోపాల్‌రెడ్డి చర్చను లేవనెత్తారు. తాజాగా మరోసారి సీఎం వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించడం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోననే ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్‌లో తనకు ఇచ్చిన హామీ నెరవే ర్చడం లేదనే అసంతృప్తిలో ఉన్న రాజగోపాల్‌రెడ్డి పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగానే ఉంటున్నారు. మునుగోడు నియోజకవర్గానికే తన పర్యట నను పరిమితం చేసుకున్నారు. ఇటీవల తుంగతుర్తి సభకు, అంతకుము నుపు హుజూర్‌నగర్ సభకు సైతం ఆయన డుమ్మాకొట్టగా, నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే సమీక్షలకు సైతం గైర్హాజరవుతున్నారు. మొత్తంగా రాజగో పాల్‌రెడ్డి రాజేసిన అసమ్మతి ఎంతమేరకు విస్తరిస్తుందనే అంశంపై ప్రతిప క్షాలు సైతం ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో ఇద్దరు సీనియర్ మంత్రులుండగా, అధిష్ఠానం ఇచ్చిన హామీ నెరవేర్చాలంటూ రాజగోపాల్ రెడ్డి, ఎస్టీ కోటాలో ఇవ్వాలని బాలూనాయక్ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తు న్నారు. మరోవైపు ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య సైతం ఇటీవల హైదరాబా ద్‌లో జరిగిన ఒక సమావేశంలో యాదవ సామాజికవర్గానికి కేబినెట్‌లో స్థానం లేదని, అవకాశం కల్పించాలని డిమాండ్ చేయడంతోపాటు, అధికార పార్టీలో ఆ సామాజికవర్గం నుంచి తానొక్కరినే ఎమ్మెల్యేననే విషయాన్ని ప్రస్తావించడం ద్వారా మంత్రిపదవికి పోటీలోకి వచ్చారు. మరోవైపు మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు తమ వర్గానికి కేబినెట్‌లో స్థానం కల్పించా లంటూ ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసి విన్నవించగా, అందులో మందుల సామేల్, వేముల వీరేశం ఉన్నారు. వీరందరి విజ్ఞప్తి మేరకే అడ్లూరి లక్ష్మ ణ్‌కు మంత్రి పదవి దక్కిందని ఇటీవలి తుంగతుర్తి సభలోనూ నాయకులు ప్రసంగాల్లో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి ఒంటరి పోరాటంగా మిగులుతుందా..? లేక ఆయనతో ఇతర ఎమ్మెల్యేలు, నాయకులు గళం కలుపుతారా...? అనే అంశం తేలాల్సి ఉంది.

ప్రవాహానికి ప్రతిబంధకాలుగా..

ఎడమకాల్వలో పేరుకుపోయిన ఇసుకమేట, వ్యర్థాలు



వేములపల్లి చెరువు అలుగు యూటీ సమీపంలో ఎడమకాల్వలో ఇసుక మేట

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్/ వేములపల్లి)

నాగార్జునసాగర్ ఎడమకాల్వలో ఎక్కడికక్కడే ఇసుక మేటలు, వ్యర్థాలు కాల్వ నీటిప్రవాహానికి ప్రతిబంధకాలుగా మారాయి. ప్రధానంగా ప్రాజెక్టు వద్ద ఎడమకాల్వ గేట్ల ముందు అడ్డుగా రాళ్లకుప్పలు పేరుకుపోయాయి. 11వేల క్యూసెక్కుల నీరు ప్రవహించాల్సి ఉండగా రాళ్లు అడ్డుగా ఉండటంతో కనీసం తొమ్మిది వేల క్యూసెక్కుల నీరు కూడా ప్రవహించడం లేదు. కాల్వలోకి నది నుంచి నీళ్లు వచ్చే అప్రో చ్ కెనాల్‌లోనూ రాళ్లు కుప్పలుకుప్పలుగా పేరుకుపోయి నీటి ప్రవాహనికి అడ్డుగా ఉన్నా ప్రాజెక్టు అధికారులు పట్టించుకో వడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎడమ కాల్వ టన్నెల్ ముందు భాగంలో లైనింగ్ వేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు. కాల్వ కట్టవెంబడి చెట్లు పెరిగి వేర్లు కాల్వ దారుల్లోకి రావడంతో బండరాళ్లు కూలుతు న్నాయి. అవి నీటివిడుదల చేసినప్పుడు టన్నెల్ లోపలికి కూడా కొట్టుకోని పోయి టన్నెల్‌లో కూడా రాళ్ల కుప్పలు ఏర్ప డ్డాయి. దీంతో కాల్వలో పూర్తిస్థాయిలో నీరు ప్రవహించ కుండా అడ్డంగా బండరాళ్లు ఉంటున్నాయి. వాటిని తొలగించ కపోవడంతో నీటిప్రవాహం తగ్గుతుందని రైతులు పేర్కొంటు న్నారు. అదేవిధంగా ఎడమకాల్వకు మరమ్మతు సమయంలో వ్యర్థాలను కాంట్రాక్టర్లు కాల్వలో వదిలేయడంతో కుప్పగా ఏర్పడి ఇసుకమేటలు తయారయ్యాయి. వేములపల్లి శివారు లోని ఎల్-13కి దిగువగా చెరువు అలుగు సమీపంలో అండర్ టన్నెల్(యూటీ) వద్ద వ్యర్థాలను తొలగించలేదు. దీంతో అక్కడ భారీగా రాళ్లు, ఇసుక మేటలు ఏర్పడ్డాయి. ఇవి నీటి ప్రవాహనికి తీవ్ర అడ్డంకిగా మారాయి. అన్నపురెడ్డిగూడెం శివారులోని ఎల్-11, 12 సమీపంలో సైతం ఇసుక మేటలు, వ్యర్థాలు ఒక్కచోట చేరి భారీ కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలతో కాల్వకట్టలు నీటిప్రవాహ ఒత్తిడికి లోనవుతు న్నాయి. దీంతో కాల్వ కట్టలు బలహీనపడి తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. త్వరలో కాల్వలకు నీటి విడుదల చేసే అవకాశం ఉన్నా తొల గించకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఎన్ఎస్పీ మానిటరింగ్ డీఈఈ గోపినాథ్‌ను వివరణ కోరగా వాటిని తొలగించేందుకు అంచనా తయారు చేసి ప్రభుత్వానికి నివేదించామని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే తొలగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

జగ్గయ్యపేట నుంచి చింతిర్యాలకు
ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభం



జగ్గయ్యపేట నుంచి చింతిర్యాలకు ఆర్టీసీ బస్ సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య

చింతలపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో నుంచి సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని చింతిర్యాల వరకు బస్సు సర్వీసును జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య శనివారం ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రోజుకు ఐదు మార్లు బస్సు రాకపోకలు ఉంటాయన్నారు. చింతలపాలెం మండలంలోని విష్ణు సిమెంట్, దొండపాడు, గుడిమల్కాపురం, మల్లారెడ్డి, పాతవెల్లటూరు ఎక్స్‌రోడ్డు, శోభనాద్రిగూడెం, తమ్మారం, కొత్తూరు ఎక్స్‌రోడ్డు, కిష్టాపురం, నక్కగూడెం, చింతిర్యాలరేవు వరకు ఉన్న గ్రామాల ప్రజలకు బస్సు సర్వీసు అందుబాటులో ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య దృష్టికి తీసుకెళ్లిన మంత్రి ఉత్తమ్

జగ్గయ్యపేట నుంచి చింతిర్యాలకు బస్‌సర్వీసుల కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేసినట్లు కాంగ్రెస్ పార్టీ చింతలపాలెం మండల అధ్యక్షుడు నరాల కొండారెడ్డి తెలిపారు. కరోనా ముందు బస్ సర్వీసులు చాలా ఉండేవని, కరోనా నుంచి నిలిపివేశారన్నారు. ఈ ప్రాంత ప్రజలు రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన జగ్గయ్యపేట ఎమ్మెల్యే తాతయ్యకి చెప్పడంతో ఆయన ఏర్పాటుచేయించారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ శ్రీని వాస్‌శర్మ, బొబ్బ కోటిరెడ్డి, రాములునాయక్, చిలకల శ్రీనివాసరెడ్డి, దానం, రఘురాం పాల్గొన్నారు.

అఖిలపక్షాన్ని వెంటనే ఢిల్లీకి తీసుకెళ్లాలి



నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న బీసీ విద్యార్థి సంఘాల నాయకులు

నల్లగొండ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వే షన్ల అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని బీసీ విద్యార్థి సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్‌గౌడ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన అమలులో రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ తర హాలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు కార్యాచరణ తీసుకోవాల న్నారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభు త్వాన్ని ఒప్పించి 42శాతం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూ ల్‌లో చేర్పించాలన్నారు. చట్టబద్ధమైన ప్రక్రియను పూర్తి చేయాల్సిన బాధ్యత బీజేపీపై ఉందన్నారు. లేదంటే బీసీ వ్యతిరేక పార్టీగా, దోషులుగా తెలంగాణ సమాజం ముందు నిలబడాల్సి వస్తోందని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పంపించిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ సానుకూల దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రస్తుతం బీసీలకు అమలవుతున్న 27శాతం రిజర్వేషన్లలో కూడా ముస్లిం సమాజం ఉందని, అదేవి ధంగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన చాలా రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లను మత ప్రతిపాదికన అమలు చేస్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ, బీఆర్ఎస్‌లు ద్వంద‌విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాద గిరి, బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ గౌడ్, విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోగాకు రవికు మార్‌యాదవ్, శ్రీకాంత్, మహేష్, మణికుమార్, రాములు, శివ, యాదగిరి, ప్రభాకర్, నరసింహ, మహేష్, పృధ్వీ, సాత్విక్, ప్రదీప్, పునేందర్ పాల్గొన్నారు.

సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు డీలక్స్ బస్సులు ప్రారంభం

సూర్యాపేటఅర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో నుంచి ఎలక్ట్రిక్ డీలక్స్ బస్సులు శనివారం నుంచి బస్సులు ప్రారంభమయ్యాయి. ఉదయం 6,10 గంటల నుంచి రాత్రి 8.40 గంటల వరకు ప్రతీ గంటకు ఒక బస్సు చొప్పున 15ట్రిప్పులు నడుపుతున్నామని డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలి పారు. ఈ డీలక్స్ బస్సులు సూర్యాపేట నుంచి సింగిల్‌స్టాప్, సూపర్‌ఫాస్ట్ సర్వీసులుగా నడిపిస్తా మని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం ప్రకటనలో పేర్కొన్నారు.



• ఫిష్ వెంకట్‌తో రాయిగిరికి అనుబంధం



హైదరాబాద్‌లో శుక్రవారం మృతి చెందిన సినీనటుడు, కమెడియన్ ఫిష్ వెంకట్‌తో యాదాద్రిభువనగిరి జిల్లాకు అనుబంధం ఉంది. 2022లో మే 5న వేసవి స్థానిక ఉన్నత పాఠ శాల ఆవరణలో జిల్లా యువజన క్రీడల శాఖ, శాంతి ట్రాక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడల్లో ఆయన చిన్నారులతో కలిసి పాల్గొని గ్రూప్ ఫొటో దిగారు. ఆయన మృతికి యువజన సంఘాల సమితి జిల్లా ప్రధానకార్యదర్శి దాసరి శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు.

-(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)

శాస్త్రోక్తంగా నిత్యపూజలు





నిత్యకల్యాణోత్సవంలో హారతి ఇస్తున్న అర్చకుడు, సాంస్కృతిక కార్యక్రమంలో కళాకారుల ప్రదర్శన

యాదగిరిగుట్ట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : యాదగి రిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషే కించి, అర్చించారు. ప్రాకారమండపంలో సుదర్శన హోమం వైభవంగా చేపట్టారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లను తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి నిత్యతిరుకల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం, సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో నిత్యారాధనలు, నిత్య రుద్రహ వన పూజలు కొనసాగాయి. ఆలయ కళావేదిక మండ పంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.31,88,975 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు. కాగా స్వామి వారిని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ మనువడు సర్వేపల్లి వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. పండితులు వేదమండపంలో వారికి వేదఆశీర్వచనం చేయగా చిత్రపటం, లడ్డూ ప్రసాదం ఆలయ అధికా రులు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆధ్యాత్మిక మాసపత్రిక ఎడిటర్ ఈశ్వర్‌కుమార్, ప్రధానోపాధ్యా యురాలు జానకి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


23న హుండీ కానుకల లెక్కింపు

స్వామివారి హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కొండకింద వ్రత మండపంలో ఉదయం ఏడు గంట లకు లెక్కింపు ప్రారంభిస్తామన్నారు.

రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ట్యూషన్ సెంటర్

హుజూర్‌నగర్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచిత ట్యూషన్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు సేవాసమితి ప్రతినిధి సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ప్రతిరోజు ట్యూషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మఠంపల్లి ఎంపీడీవోగా వెంకటాచారి



మఠంపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మఠంపల్లి మండల అభివృద్ధి అధికారిగా ఎస్.వెంకటాచారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. వనపర్తి జిల్లాలో ఎంపీడీవోగా పని చేస్తున్న వెంకటాచారి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనను కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల కేటాయింపులో గందరగోళం

» పైలెట్ ప్రాజెక్టుగా చివ్వెంల మండలం భీమ్లాతండా » గ్రామంలో 28 మందికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ » అనుమతి మాత్రం 11మందికే.. ఇళ్లు కట్టేది మాత్రం ఆరుగురే..



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

(ఆంధ్రజ్యోతి-చివ్వెంల) : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమ లు కోసం ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజె క్టుగా ఎంపిక చేసింది. అందులో భాగంగా చివ్వెంల మండ లంలోని భీమ్లాతండాను అధికారులు ఎంపిక చేశారు. చిన్న గ్రామం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న లక్ష్యా లను ప్రజలకు అందజేయవచ్చనే సంకల్పంతో ముందుకు పోవాలని అధికారులు భావించారు. ప్రాజెక్టు కింద రైతు లందరికీ రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు మొదలగు పథకాలు అందజేయాల్సి ఉంది. కానీ ఈ గ్రామంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రైతు భరోసా గ్రామంలోని రైతులందరికీ అందింది. కానీ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు లో గందరగోళ పరిస్థితి నెలకొంది. భీమ్లాతండాలో ప్రజాపాలనప్రారంభం రోజునా సొంతగూడు లేని నిరుపేదల గుర్తి ంచి 28 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం అసలు ఏం జరిగిందో తెలియదు కానీ చివరగా తుది జాబితాలో 11 మంది పేర్లు మాత్రమే వచ్చాయని అధికారులు చెప్పారు. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గు పోయడానికి వచ్చిన అధికారులను అందరికీ ఒకే సారి ముగ్గులు పోయాలని, పనికిరాని పట్టాలు తమకు ఎందుకు అని వాటిని చింపేశారు. రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా ఎవరికీ తెలియకు ండా 17 మంది పేర్లను ఎలా తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు.. చేసేదేమీ లేక అధికారులు వెళ్లిపోయారు.

ఎంపీడీవో లాగిన్‌లో 20 మంది పేర్లు

ఎంపీడీవో లాగిన్‌లో 20 మందికి జనరేట్ చేశారు. కలెక్టర్ 11మందికి అనుమతి ఇచ్చారు. కానీ ఇక్కడ కలెక్టర్ ఇచ్చిన 11మంది,ఎంపీడీవో ఇచ్చిన 20 మందికి ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ పద్ధతిలో ప్రొసీడింగ్ ఇచ్చారు. దీంట్లో 6 మంది మాత్రమే ఇంటి నిర్మాణం చేపట్టారు. అధికారులు ఏమో ఆన్‌లైన్‌లో మీ పేరు ఉంటేనే ఇంటి నిర్మాణం చేపట్టాలని చెబుతున్నారు. మరీ అందులో పేరులేని 11 మ ందికి ఎలా అవకాశం ఇచ్చారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగుడిని అయినా నా పేరు తొలగించారు



సీఎం రేవంత్ రెడ్డి అర్హులైన దివ్యాంగులకు మొదటి విడతలో ఇళ్లు ఇవ్వాలని ఆదేశిస్తే ప్రొసిడింగ్ ఇచ్చిన తర్వాత దివ్యాంగుడి అని చూడకుండా నా పేరు తొలగించారు. నాకు ఇళ్లు లేక మా అన్న ఇంట్లో ఉంటున్న. నా పేరు మీద ఇళ్లు వస్తే ఎంతో సంతోషించా . ఇప్పుడు నా పేరు తొలగించడంతో ఏమి చేయాలో అర్థం కావట్లేదు.

- ధరావత్ రాజు, భీమ్లాతండా

11 మందికే ఇళ్లు నిర్మాణం

మొదటగా 28 మందికి పట్టాలు ఇచ్చాము. దాంట్లో నుంచి 11 మందికి మాత్రమే ఇళ్ల నిర్మాణాలకు అవకాశం కల్పించాం. నా లాగిన్‌లో 20 మందికి ఇవ్వాలని జనరేట్ చేసి పంపించా. కలెక్టర్ ఆఫ్‌లైన్‌లో 11 మందికి మం జూ రు చేశారు. మొత్తంగా ఇప్పటివరకు ఏవి ఆన్‌లైన్‌లో న మోదు కాలేదు. 6 గురు మాత్రం నిర్మాణం చేపట్టారు. వారి కి ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున అందజేశాం. ఉన్న తా ధికారుల సూచనలమేరకు మిగతా వారిపై నిర్ణయం తీసుకుంటాము.

- సంతోష్‌కుమార్, ఎంపీడీవో, చివ్వెంల

సమాచారం

ఏపీ మంత్రి లోకేష్‌ను కలిసిన వేమూరి



మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న వేమూరి

మునగాల, జూలై 19(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాలోకేష్‌ను సామాజిక కార్యకర్త, టీడీపీ కోదాడ నాయకుడు వేమూరి సత్యనారాయణ ఉండవల్లిలోని ఆయన నివాసంలో శనివారం కలిశారు. కోదాడ నియోజకవర్గ టీడీపీ బలోపేతం, సామాజిక కార్యక్రమాలపై వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి టీడీపీకి పూర్వ వైభవం తేవాలని సూచించారు.

రేపు కంటి వైద్య శిబిరం

సూర్యాపేటఅర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఈనెల 21వతేదీన శరత్‌మాక్స్ లేజర్ కంటి ఆసుపత్రి వరంగల్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి మందులు, శస్త్రచికిత్స చేయనున్నట్లు వివరించారు.

ఎస్‌ఐగా అజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

మోతె, జూలై 19(ఆంధ్రజ్యోతి) : మండల ఎస్‌ఐగా శనివారం అజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భ ఎస్‌ఐకి సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన యాదవేందర్‌రెడ్డి విధుల్లో భాగంగా ఎస్పీ కార్యాలయానికి బదిలీయ్యారు

రేషన్ కార్డుల పంపిణీ

తిరుమలగిరి, జూలై19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్‌కార్డులను తిరుమలగిరి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్ శనివారం లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో డీటీ జాన్‌మహ్మద్, మార్కెట్ డైరెక్టర్ హఫీజ్, మోహన్ పాల్గొన్నారు.

రామస్వామికి నివాళి

గరిడేపల్లి, జూలై 19 ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సీపీఎం సీనియర్ నాయకుడు రాచమల్ల రామస్వామి శనివారం గుండెపోటు మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి రామస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ యా కుబ్, నెమ్మాది వెంకటేశ్వర్లు, యాదగిరిరావు, పాల్గొన్నారు.

దాతలు సహకారం అభినందనీయం

సూర్యాపేట అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) :పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకారం అభినందనీయమని డీఈవో అశోక్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎంఏఎం ఉన్నత పాఠశాలలో దాతలు శీల వీరేంద్రసింహ, ఉప్పల కిరణ్ సహకారంతో రూ.2.60లక్షలతో నిర్మించిన బాలికల మూత్రశాలలను ఆయన ప్రారంభించారు..

విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలి



ఆత్మకూర్ (ఎస్)జెండాలతో ప్రదర్శన చేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందర్‌రావు కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాజీ, ఉమేష్, విష్ణు, గౌతమ్, వేణు, కిరణ్, క్రాంతి, నాగేందర్, గౌతమ్, నాగరాజు పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్) : ప్రైవేట్ విద్య సంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని నిరసిస్తూ ఈనెల 23వ తేదీన నిర్వహించే విద్యా సంస్థ బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. సంఘం మండల నాయకుడు బొర్ర లెనిన్ మాట్లాడుతూ కాం గ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియ ంత్ర చట్టం తీసుకొస్తామని చెప్పి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

సూర్యాపేటటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయుసీఐ) రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్.పద్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని లెనిన్‌నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మా ట్లాడారు. ఈనెల 31వతేదీన చేపట్టే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలన్నారు కార్యక్రమంల గొడ్డలి నర్సయ్య, గోగుల వీరబాబు, ఐతరాజు వెంకన్న, ఎస్‌కె. రజాక్, రమేష్, రవి, కృష్ణ పాల్గొన్నారు.

దొడ్డా నారాయణరావు జీవితం ఆదర్శం



చిలుకూరులో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

హుజూర్‌నగర్ , కోదాడరూరల్, నేరేడుచర్ల, గరిడేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ నాయకుడు దొడ్డా నారాయణరావు జీవితం ఎంతోమందికి ఆదర్శమని పలు వురు సీపీఐ నాయకులు అన్నారు. శుక్రవారం పలు మండల కేంద్రాల్లోని సీపీఐ కార్యాల యా ల్లో ఆయన చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళు లర్పించారు. హుజూర్‌నగర్ పట్టణంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు ,కౌలు రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కొప్పోజు సూర్యనారాయణ, కోదాడలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్, రూరల్ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు, నేరేడుచర్లలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు, కత్తి శ్రీనివాసరెడ్డి, గరిడేపల్లి మం డలంలో రంగాపురంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు, కడియాల అప్ప య్య నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చిలుకూరు : దొడ్డా నారాయణరావు సంతాప సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారంనిర్వహిస్తున్న సంతాప సభ సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులతో పాటు వివిధ పార్టీల నా యకులు హాజరవుతున్నారని ఆయన అన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, కంపాటి వెంకటయ్య పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న కమిషనర్ శ్రీనివాసరెడ్డి

హుజూర్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని శ్రీచైత్య పాఠశాలకు చెందిన విద్యార్థులు నాసా స్పేస్ కాంటెస్ట్ పోటీలలో ప్రతిభ చూపగా వారికి మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజిక్స్‌లో ప్రాజెక్ట్ వర్క్ చేసి జాతీయ స్థాయిలో రెండవ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సిరిమహేశ్వరి, మోక్షిత, యశ్వంత్, మనోజ్, సాయి, నిఖిలేష్‌లకు ప్రశంసా పత్రాలు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, అశోక్, రాజశేఖర్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, సతీష్, శ్రీనివాస్, నాగేందర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక

గరిడేపల్లి, జూలై 19 ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక నిర్వహించారు. 2024-25 సంవత్సరంలో చేసిన ఉపాధి హామీ జూలై 5 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన 15వ విడత సామాజిక తనిఖీలో సేకరిం చిన నివేదికను ప్రజా వేదికలో వినిపించారు. మండలంలో 2024-25 సంవత్సరానికి రూ.8.94 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. వీటిలో కూలీలకు రూ.8.38 కోట్లు కేటాయించగా, రూ. 55లక్షల 777లు మెటీరియల్ కోసం కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ శిరీష, ప్రత్యేకాధికారి శ్యాంసుందర్ ప్రసాద్ ఎండీవో సరోజ, ఎంపీవో ఇబ్రహీం, పద్మనాభం పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి



అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మద్దిరాల, జూలై 19(ఆంధ్రజ్యోతి): పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుంన్నదని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలం చందుపట్లలో ఉపాధి హామీ నిధులు రూ.12లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవన పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో రూ.1,400 కోట్లతో సీసీ రోడ్డు పనులు చేపట్టామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన మీసాల జ్యోతిర్మయి అనారోగ్యానికి గురి కావడంతో సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.50 లక్షల ఎల్‌వో పత్రాన్ని భర్త రాజలింగానికి ఎమ్మెల్యే అందజేశారు. చందుపట్ల గ్రామంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏవో అనిషారోహి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిల మల్లుయాదవ్, నాయకులు పచ్చిపాల సుమతీ వెంకన్న, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తీకుళ్ల సుధాకర్‌రెడ్డి, కొమ్ము వెంకన్న, కొమ్ము అంజయ్య, మోహన్‌రెడ్డి, తాళ్లపల్లి సురేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రతను అలవర్చుకోవాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న కమిషనర్ హన్మంతరెడ్డి

సూర్యాపేటటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాల నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునే దిశగా పరిశుభ్రతను అలవర్చుకోవాలని మునిసిపల్ కమిషనర్ సీహెచ్. హన్మంతరెడ్డి అన్నారు. స్థానిక 42వవార్డులో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. వ్యా ధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి మునిసిపల్ వాహనాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, ప్రణీత పాల్గొన్నారు.

● నేరేడుచర్ల : మునిసిపాలిటీల్లో చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా 48వ రోజు శనివారం పట్టణంలోని ప్రకృతి వనంలో మొక్కలు నాటారు. అనంతరం 12వ వార్డులో తడి, పొడి చెత్త వేరుచేసే విధానం, ఎరువు తయారీ, డెంగ్యూ, మలేరియాపై అవగాహన కల్పించారు. అనంతరం మురుగు కాల్వలలో పూడిక తీయించి దోమలు వృద్ధి చెందకుండా మలాథియాన్ స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డు అధికారులు, ప్రజాప్రతినిధులు, సమభావన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కోదాడటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మాజీ సర్పంచ్, కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్నేని వెంకటరత్నం బాబు అన్నారు. శనివారం పట్టణంలో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థుల అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పది పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన తాళ్లూరి రేఖశ్రీకి రూ.5 వేలు, అలాగే ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన నరేంద్రకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు.ఎంఈవో సలీంషరీఫ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం ఎం.రామారావు, ఎన్.శ్రీనివాసరావు, ఎస్.అప్పారావు, ఎం. పుల్లయ్య, ఎస్. హనుమంతరావు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులు సరిగా ఉండాలి

అర్వపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయతీల రికార్డులు తప్పులు లేకుండా సరిగా ఉండాలని డీపీవో నారాయణరెడ్డి అన్నారు. శనివారం జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామ రైతు వేదికలో నాగారం, జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి మండలాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపి, ఎంవో నగేష్, ఏవో గణేష్, ఎంఈవో బాలునాయక్, ఏఈలు శ్రావణి, శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

22 నుంచి కేవీపీఎస్ శిక్షణ తరగతులు

చివ్వెంల జూలై 19, (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈనెల 22, 23, 24 తేదీల్లో జరిగే కేవీపీఎస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పిండిగ నాగమణి పిలుపునిచ్చారు. కుడకుడలో శనివారం శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కోట కిరణ్, కాసర్ల సతీష్, మహేష్, పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బాలసభలు ఉపయోగం

నూతనకల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే బాలసభలు భవిష్యత్‌లో ఉపయోగపడతాయని ఎంఈవో రాములునాయక్ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అక్షర ఫౌండేషన్ ఆధర్యంలో విద్యార్థులకు బాలసభ, క్విజ్‌పోటీ, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి, రాములు, రమేష్ పాల్గొన్నారు.

కాటమయ్య రక్ష కిట్లు గౌడ కులస్థులకు వరం

మఠంపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కాటమయ్య రక్ష సేఫ్టీకిట్లు గౌడ కులస్థులకు వరం లాంటిదని హుజూర్‌నగర్ ఎక్సైజ్ ఎస్‌ఐ జగన్మోహన్‌రెడ్డి అన్నా రు. మండల కేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయంలో శనివారం రక్ష సేఫ్టీ కిట్లను గౌడ కులస్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్థులు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వల్లపుదాసు జోసు, ఆలయ ఛైర్మన్ మహేష్ గౌడ్, కాసాని ఎల్లయ్యగౌడ్, వి.హనుమంతు, మట్టపల్లి అన్నదాన సత్ర కమిటీ అధ్యక్షుడు దొంతగాని రాములు గౌడ్, నరసయ్య గౌడ్, పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

హుజూర్‌నగర్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ట్రాక్టర్ మెకానిక్ కృష్ణ కుటు ంబానికి మెకానికల్ యూనియన్ ప్రతినిధులు శనివారం పరా మర్శించారు. కృష్ణ కూతురు ఉమ పేరు మీద రూ.50వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అట్టి పత్రాలను భార్య విజయలక్ష్మికి అందించారు. యూనియన్ నాయకులు గుడిపాటి అనిల్, పచ్చిపాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

●చివ్వెంల : మండలంలోని బండమీది చందుపట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మహి ళా విభాగం అధ్యక్షురాలు యర్ర ఈద మ్మ క్యాన్సర్‌తో ఇటీవల మరణించారు. చివ్వెంల పీఏసీఎస్ చైర్మ న్ మారినేని సుధీర్ రావు శనివారం ఆమె కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు అందజేశారు.

● హుజూర్‌నగర్ : పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన కొమ్ము బాలరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి తిలక్‌నగర్‌కు చెందిన అంబేడ్కర్ లయన్స్ ఆధ్వర్యంలో రూ. 5 వేలు ,కళాకారుల టీమ్ 50 కిలోల బియ్యం అందజేశారు.

● ఆత్మకూర్(ఎస్): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బొల్ల శ్రీనివాస్‌రెడ్డి సతీమణి సరిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెం దింది కాంగ్రెస్ నాయకులు బొల్లా శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని పరా మర్శించి గ్రామ కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.60వేలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాకి కృపాకర్‌రెడ్డి, గొట్టిముక్కల శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుల శేఖర్‌రెడ్డి, మిర్యాల లింగారెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో నీరు నిలువ కుండా చూడాలి

కోదాడ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామ డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని డీపీఓ యాదగిరి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అనేక మండలాల నుంచి పారిశుధ్యంపై పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గ్రామ కార్యదర్శులు ప్రతి రోజూ చెత్త సేకరణ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలన్నారు. పంచాయతీ సిబ్బంది డ్రైనేజీల్లో మురుగునీరు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రకటించే ఉత్తమ గ్రామపంచాయతీల ఎంపిక విధివిధానాలను ఆయన కార్యదర్శులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్, సూపరిండెంట్ రాంచందర్‌రావు, ఎంపీవో పాండురంగయ్య, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

మఠంపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ పాటించాలని తహసీల్దార్ మంగా అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్టాక్ రూంను సందర్శించి విద్యార్థుల హాజరు రిజిష్టర్, స్టాక్ రిజిష్టర్, మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండాలి



గోరింటాకు చూపిస్తున్న విద్యార్థినులు

సూర్యాపేటఅర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండాలని శ్రీలక్ష్మి వెంకటసాయి కళాశాల కరస్పాండెంట్‌కారింగుల బాలగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఆషాఢ గోరింటాకు సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కారింగుల విజయలక్ష్మీ, ప్రిన్సిపాల్ స్వాతి, జ్యోత్స్న, నరేష్, ప్రభాకర్, వీరన్న పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగేదీ?

(5వపేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తరహాలో అధికారుల ప్రయత్నాలు, సూచనలు లేకపోవడంతో కొత్తరకం సాగు వైపు రైతులు మొగ్గు చూపడంలేదు. కాగా ఎప్పుడు ఒకే రకమైన సాగు(మూససాగు)ను నమ్ముకొని నష్టపోతున్నారు. ఓ వైపు సిబ్బంది కొరత కూడా ఉద్యా న శాఖను వేధిస్తోంది. ఆ శాఖలో ఒక ఏడీ పోస్టు మంజూరు కాగా ఒకరు పనిచేస్తున్నారు. ఆఫీసర్ పోస్టుల్లో ఐదుగురిని నియమించారు. సెరికల్చర్ ఆఫీసర్, టెక్నికల్ ఆఫీసర్స్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు ఐదు మంజూరు కాగా ఎవరినీ నియమించలేదు. ఈ పోస్టులను కూడా ప్రభుత్వం మంజూరు చేస్తే కొంత మేరకు రైతులకు ప్రయోజనం చేకూరునుంది.

అవగాహన కల్పిస్తున్నాం

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కువగా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు. మనుగాల మండలం మాధవరం నర్సరీ వద్ద ఆయిల్‌పామ్ మొక్కలు తెచ్చుకుంటే కంపెనీ వాళ్లే ఎగుమతి ఖర్చులు భరిస్తారు. అదేవిధంగా నూతనకల్ మండలం చిల్పకుంట్ల వద్ద నర్సరీ ఏర్పాటుచేశాం. రైతులు విక్రయించడానికి ఇబ్బందిపడకుండా కంపెనీ వాళ్లే కొనుగోలు చేస్తారు.

-నాగయ్య, ఏడీ, ఉద్యాన శాఖ